



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభాకర్ రెడ్డి

పంటలకు గిట్టుబాటు ధర ఏది..?

- హామీలు చిత్తశుద్ధితో అమలు చేయాలి
- పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలి
- రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి

ప్రజాశక్తి - దేవనకొండ

పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని ఏపి రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలు చిత్తశుద్ధితో అమలు చేయాలని కోరారు. శనివారం దేవనకొండలోని సిఐటియు కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉచిత గ్యాస్ సిలిండర్, అన్నదాత సుఖీభవ పథకాలకు సంబంధించిన నిధులు లబ్ధిదారులకు సక్రమంగా చేరడం లేదని తెలిపారు. 2024-25 ఖరీఫ్, రబీ సీజన్‌లో రైతులు సాగు చేసిన మిర్చి, పొగాకు, ఉల్లి, పత్తి పంటలకు గిట్టుబాటు ధర లభించ లేదన్నారు. ఈ ఏడాదైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల పంటలకు గిట్టుబాటు ధర నిర్ణయించాలని డిమాండ్ చేశారు. గత వైసిపి ప్రభుత్వం రైతులకు అమలు చేసిన ఉచిత పంటల బీమా ఎంతో ఉపయోగ పడిందని, ప్రస్తుత ప్రభుత్వం ఆ పథకానికి మంగళం పాడిందని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఉచిత పంటల బీమా పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం కురుస్తున్న అధిక వర్షాలతో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో పంటలు దెబ్బ తిన్నాయని, సంబంధిత శాఖాధికారులతో పంట నష్టం అంచనా వేసి రైతులకు నష్టపరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. 2018వ సంవత్సరంలో జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి కొంతమేర నిధులు కేటాయించారని, పనులు ప్రారంభించి కేవలం 20 శాతం పనులు జరిగాయని చెప్పారు. పెండింగ్‌లో ఉన్న వేదవతి, ఆర్‌డిఎస్, హంద్రీనీవా, మేలిగనూరు వరద కాలువ, గురు రాఘవేంద్ర ప్రాజెక్ట్, పంట కాలువల నిర్మాణ పనులకు నిధులు కేటాయించకపోవడంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు ఉన్నాయని మండిపడ్డారు. గోదావరి, బనకచర్ల సాగునీటి ప్రాజెక్టు పూర్తి చేస్తామని ప్రకటించడం కాదని, పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్ సంస్థలకు లాభం చేకూర్చేలా సోలార్ ఎనర్జీ పేరుతో రైతుల భూములను వాటికి అప్పజెప్పే ప్రయత్నాలను విరమించుకోవాలని తెలిపారు. సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ మాట్లాడుతూ... జిల్లాను సమగ్రాభివృద్ధి చేయడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో రోడ్లు గుంతలమయమయ్యాయని, వాటిని బాగు చేయడంలో ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యం వహిస్తున్నారని తెలిపారు. పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేయాలని, జిల్లా సమగ్రాభివృద్ధికి నిధులు కేటాయించాలని భవిష్యత్తులో సిపిఎం ఆధ్వర్యంలో ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు కె.వెంకటేశులు, ఎమ్‌డి.ఆనంద్ బాబు, బి.వీరశేఖర్, మండల కమిటీ నాయకులు అశోక్, యూసుఫ్ బాష, మహబూబ్ బాషా, సూరి, ప్రజా సంఘాల నాయకులు నాగేష్, మహేంద్ర, రాము, మహేష్ పాల్గొన్నారు.

మార్కెట్ యార్డు ప్రథమ స్థానంలో నిలవాలి


-పరిశ్రమల శాఖ మంత్రి టిజి.భరత్ సూచన -కర్నూలు మార్కెట్ యార్డ్ నూతన చైర్మన్, డైరెక్టర్ల ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి టిజి.భరత్

కర్నూలు వ్యవసాయ మార్కెట్‌ను రాష్ట్రంలోనే నెంబర్ వన్ స్థానానికి తీసుకురావాలని పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖల మంత్రి పిజి భరత్ సూచించారు. శనివారం కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్, డైరెక్టర్లు ప్రమాణ స్వీకారం చేశారు. భారీ ర్యాలీ బాణాసంచాలు కాలుస్తూ ఆనందోత్సాహాల మధ్య మార్కెట్ యార్డు సభా ప్రాంగణానికి చేరుకున్నారు. మార్కెట్ యార్డు సెక్రటరీ ఆర్.జయలక్ష్మి ఆధ్వర్యంలో నూతనంగా పదవీ బాధ్యతలు చేపట్టిన చైర్మన్ గోల్కొండ అజ్మత్‌బీ, వైస్ చైర్మన్, డైరెక్టర్ల చేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సభకు ముఖ్య అతిథిగావచ్చిన మంత్రి టిజి.భరత్ మాట్లాడారు. ఎమ్మెల్యే అయినప్పుడు ఎంత ఆనందంగా ఉందో ఈరోజు కూడా అంతే ఆనందంగా ఉందన్నారు. తాను మా మనుషులకు కమిట్‌మెంట్ ఇచ్చానని, పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరితకు కేటాయింపులు ఇవ్వలేకపోయానని చెప్పారు. గౌరు చరితక్కతో మాకు ఎలాంటి భేదాభిప్రాయాలు లేవని అన్నారు. రాబోవు రెండేళ్లలో బెస్ట్ మార్కెట్‌గా అభివృద్ధి చేయాలని అందుకునా వంతు సహకారం అందిస్తానని తెలిపారు. కూటమి ప్రభుత్వం సంక్షేమ, అభివృద్ధి రెండు చేస్తుందని అన్నారు. రిలయన్స్ కంపెనీ వారు ఓర్వకల్ లో 1600 వేలకోట్లు పెట్టుబడులు పెట్టి ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమ పెడుతున్నట్లు చెప్పారు. పెట్టుబడులు వస్తే పరిశ్రమలు వస్తాయన్నారు. పరిశ్రమలు వస్తే స్థానికులకు ఉద్యోగ అవకాశాలు వస్తాయన్నారు. కొంతమంది ముస్లింలు విష ప్రచారం చేస్తున్నారని, కులాలు, మతాలను కలుపు కొనే కుటుంబం మాది అని చెప్పారు. అభివృద్ధి చేయడానికి మేమున్నామని, అందరి ఆశీర్వాదాలు ఉండాలని ఆకాంక్షించారు. మార్కెట్ యార్డ్ చైర్మన్ గోల్కొండ అజ్మత్‌బీ మాట్లాడుతూ కమిటీ సభ్యులతో కలిసి మార్కెట్ యార్డ్ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ముస్లిం మైనార్టీ జిల్లా అధ్యక్షులు గోల్కొండ అబ్దుల్ హమీద్ మాట్లాడుతూ అందరం కలిసి పని చేస్తామన్నారు. మాకు ఇచ్చిన బాధ్యతను నెరవేర్చి గోల్కొండ పేరు ప్రఖ్యాతులు తీసుకు వస్తానని చెప్పారు. జనసేన నాయకులు హర్షద్ మాట్లాడుతూ మంత్రి మాట ఇచ్చిన ప్రకారం ముస్లిం మైనారిటీలకు మార్కెట్ యార్డ్ చైర్మన్ పదవి ఇచ్చారని తెలిపారు. ఆదోని మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు మాట్లాడుతూ మార్కెట్ యార్డ్ కమిటీలో 9 మంది స్త్రీలు ఆరుగురు పురుషులు మొత్తం 15 మందితో కమిటీ ఎన్నుకోవడం హర్షనీయమన్నారు..రైతులు వ్యాపారస్తులకు ఎలాంటి సమస్యలు రాకుండా చూడాలన్నారు. కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ కే శేషగిరిరావు మాట్లాడుతూ మంచి కమిటీని ఎన్నుకున్నారన్నారు. తెలుగుదేశం నగర అధ్యక్షులు నాగరాజు యాదవ్ ,ఎస్‌సి కార్పొరేషన్ చైర్మన్ ఎ.ప్రభాకర్, బీసీ వెల్ఫేర్ బొందెల చైర్మన్ రాజు సింగ్, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ఆకెపోగు ప్రభాకర్, బ్రాహ్మణ సంఘం డైరెక్టర్ మారుతిశర్మ తదితరులు మాట్లాడారు. మార్కెట్ యార్డ్ కార్యదర్శి ఆర్. జయలక్ష్మి మాట్లాడుతూ తనకు మార్కెట్ యార్డుతో పదేళ్ల అనుబంధం ఉందన్నారు. మాకు టార్గెట్లు ఇస్తారని, వాటిని నెరవేర్చేందుకు రైతులకు సేవ చేయడానికి ఉన్నామన్నారు. మార్కెట్ యార్డ్ తప్పక అభివృద్ధి చెందుతుందన్నారు. ఇటీవల సి క్యాంప్ రైతు బజార్‌కు ముఖ్యమంత్రి రూ.ఆరు కోట్లు ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. మార్కెట్ యార్డులో ప్రతిరోజు 2000 మంది శ్రామికులు పనిచేస్తారు, రోజు 5000 మంది వస్తుంటారని, 14 రకాల పంటలతో మార్కెట్లో వ్యాపారాలు జరుగుతాయన్నారు. తదుపరి మార్కెట్ యార్డ్ తరపున కార్యదర్శి ఆర్. జయలక్ష్మి ఆధ్వర్యంలో చైర్మన్‌కు డైరెక్టర్లకు శాలువా, పూలదండలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. మార్కెట్ యార్ కార్యాలయం సిబ్బంది ,అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



మార్కెట్ యార్డు చైర్మన్, వైస్ చైర్మన్, డైరెక్టర్లతో మార్కెట్ యార్డు కార్యదర్శి ఆర్.జయలక్ష్మి

గూడూరులో దుర్వాసన

- జనవాసాల మధ్య డంప్ యార్డ్
- స్పందించని నగర పంచాయతీ అధికారులు

ప్రజాశక్తి - గూడూరు



మంటలు అంటుకుని పొగలు చిమ్ముతున్న డంపు యార్డు

గూడూరు నగర పంచాయతీలో సమస్యలను పట్టించుకునే నాధుడు కరువయ్యాడు. గూడూరు నుండి మునగాల రోడ్డు సమీపంలో జనావాసాల మధ్య డంపుయార్డు ఏర్పాటు చేశారు. చుట్టు ప్రక్కల నివాసాలు ఉండడంతో ఊర్లో ఉన్న చెత్త కుప్పలు మురుగు కాల్వల చెత్తను తీసుకెళ్లి ఆ డంపుయార్డులో వేసేసరికి అక్కడ నివాసం ఉంటున్న ఎస్‌సి కాలనీ, పడమర బీసీ కాలనీ, సమీప వార్డు ప్రజలు దుర్వాసన తట్టుకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోజురోజుకు డంపుయార్డు విస్తరిస్తూ వెదజల్లడంతో ఆ చుట్టుపక్కల ఉన్న ప్రజలు విష జ్వరాలతో విరేచనాలతో మంచనా పడుతూ ప్రజలు తీవ్ర అనారోగ్యం పాలవుతున్నారు. ఎన్నిసార్లు మున్సిపల్ అధికారులకు, మున్సిపల్ చైర్మన్‌కు ఎన్ని అర్జీలు పెట్టినా అదుగో ఇదిగో అంటూ రోజులు గడుపుతున్నారు. వర్షాకాలం రావడంతో ఆ డంపుయార్డు నుంచి వచ్చే దుర్వాసనను ప్రజలు తట్టుకోలేక పోతున్నారు. అల్లరి మూకలు తాగిన మైకంలో ఎవరైనా డంపుయార్డుకు యాడ్‌కు నిప్పు పెడుతున్నారు. ఆ డంపు యాడ్ నుంచి వచ్చే పొగ వీధుల్లోకి వ్యాపిస్తోంది. అక్కడి ప్రజలు రోగాలు పడే అవకాశాలు ఉన్నాయి. అధికారులకు చెపితే వారు కూడా అధికారులు మున్సిపల్ అధికారులకు చెబితే వారు ఎవరైనా రైతులు ముందుకు వస్తే రైతుల నుంచి గవర్నమెంట్ పొలంనుకొని అక్కడ ఉన్న డంపు యాడును అక్కడికి తరలిస్తామని అధికారులు, అక్కడ ఉన్న ప్రజలు చెబుతున్నారు.

అధికారులు నిర్లక్ష్యం వల్ల సమస్య

- సిఐటియు డివిజన్ కార్యదర్శి జె.మోహన్



డంపు యార్డు సమస్యను అధికారులు పట్టించుకోవడం లేదు. అక్కడ ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతూ వ్యాధులతో బాధపడుతున్నారు. అనేక ఏళ్ల తరబడి మున్సిపల్ అధికారులకు అర్జీలు ఇచ్చినా నిద్ర మత్తులో ఉంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి అక్కడున్న డంపు యార్డును వేరే చోటికి మార్చాలి.

అర్జీలు పెట్టినా స్పందించరు

- వీర కృష్ణగౌడ్, స్థానికుడు



ఎన్నిసార్లు మున్సిపల్ అధికారులకు అర్జీలు పెట్టుకున్నా ప్రయోజనం లేదు. ప్రతి సంవత్సరం వర్షాకాలం వచ్చిందంటే మున్సిపల్ శానిటేషన్ అధికారికి ,మున్సిపల్ చైర్మన్‌కు చాలాసార్లు అర్జీలు పెట్టుకున్నా పట్టించుకునే నాథుడు కరువయ్యారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్కడి నుంచి డంపు యార్డును తొలగించాలి.

దొరకని యూరియా..!

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

ఖరీఫ్ సీజన్ ఆరంభంలోనే ఎరువు కోసం రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రానికి ఎరువులు వస్తున్నాయని తెలియడం ఆలస్యం.. వ్యవసాయ పనులు మానుకొని గంటల తరబడి క్యూలైన్‌లో వేచి ఉంటున్నారు. ఎరువుల కొరత నెలకొందనే సమాచారం రైతులను కలవర పెడుతోంది. ఖరీఫ్ సాగు సీజన్ ముంచుకొచ్చినా ఆశించిన స్థాయిలో నిల్వలు చేరలేదు. దానికి తోడు వచ్చిన యూరియా కూడా కూటమి చోటా మోటా నాయకుల కనుసన్నల్లో పక్కదారి పడుతోంది. యూరియా అందక రైతులకు అవస్థలు తప్పడం లేదు. విత్తు మొలకెత్తాక డిఎపి, కాంప్లెక్స్, సింగిల్ సూపర్ పాస్ఫేట్ వంటి ఎరువులు వినియోగిస్తారు. ఇక పైరు ఎదుగుదలలో నత్రజని (యూరియా) ఎరువులను వాడతారు. సరిపడ ఎరువులు లేవనే సమాచారంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఉమ్మడి జిల్లాలో 877 ఆర్బీకేలు ఉండగా 188 మూతపడి 689 మాత్రమే ఉన్నాయి. వీటికి యూరియా, డీఏపీ, కాంప్లెక్స్ ఎరువులు ఇవ్వకుండా పిఎసిఎస్‌లకు, డిసిఎంఎస్‌లకు సరఫరాల చేస్తున్నారు. ఆ సొసైటీలు 'కూటమి' పార్టీల నేతల చేతుల్లో ఉండటంతో వీటికి సరఫరా అవుతున్న యూరియా పలుకుబడి ఉన్న వారికే వెళ్లిపోతోంది. రైతులకు అందడం లేదు. ఎపి మార్క్‌ఫెడ్ వద్ద 401.4 మెట్రిక్ టన్నులు, రైతు సేవా కేంద్రాల వద్ద 398.67 మెట్రిక్ టన్నులు, రిటైలర్ల దగ్గర 384 మెట్రిక్ టన్నులు, సహకార సంఘాలు, మార్కెటింగ్ సొసైటీల వద్ద 54.535 మెట్రిక్ యూరియా నిల్వలు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. మరో 2187.39 మెట్రిక్ టన్నుల యూరియా జిల్లాకు రావాల్సి ఉందని అంటున్నారు. అయినా క్షేత్ర స్థాయిలో మాత్రం రైతులకు తిప్పలు తప్పడం లేదు. గత వారం రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో రైతులు ఎరువుల కోసం పరుగులు తీస్తున్నారు. గ్రోమర్ 28-28-0, ఫ్యాక్టమ్‌పాస్ 20-30-0-18, గోదావరి డీఏపీ, 16-28-26, 14-35-14 తదితర మిశ్రమఎరు వుల కోసం రైతు సేవా కేంద్రాలు, ప్రయివేటు ఎరువుల దుకాణాల చుట్టూ రైతులు ప్రదక్షిణలు చేస్తున్నారు. రైతు సేవా కేంద్రాలకు వచ్చిన కాంప్లెక్సు మిశ్రమ ఎరువులను అక్కడి సిబ్బంది అమ్మేసుకొంటున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలో నూటికి 90 శాతం రైతు సేవా కేంద్రాలకు యూరియా సరఫరా అయినప్పటికీ రాజకీయ నాయకులు, కార్యకర్తలకు మాత్రమే చేరుతోంది. వ్యవసాయ శాఖ లెక్కల ప్రకారం ఒక రైతుకు గరిష్ఠంగా 9 సంచులు ఇవ్వాలన్న నిబంధన ఉన్నప్పటికీ రాజకీయ నేతలు ఒక్కొక్కరికి 10 బస్తాలకుపైగా విక్రయిస్తున్నారు. అధికారులు రైతు సేవా కేంద్రాల వద్దకు వెళ్లి ఫొటోలకు ఫోజులిచ్చి హాజరు వేసుకుని వస్తుండటంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

విద్యాలయాల్లోకి అనుమతి నిరాకరణపై ఆగ్రహం: పాఠశాలలు ఇతర విద్యాలయాల్లోకి విద్యార్థుల తల్లిదండ్రులు మినహాయించి ఇతరులు ఎవరు వెళ్లరాదని ఉత్తర్వులను జారీ చేసింది. ఈ ఉత్తర్వులను వ్యతిరేకిస్తూ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలను చేపట్టారు. కూటమి ప్రభుత్వం ఇటీవల కాలంలో జారీ చేసిన ఉత్తర్వుల పట్ల ప్రజాస్వామ్యవాదులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విద్యారంగం మొత్తం కార్పొరేట్ ప్రైవేటు సంస్థల చేతుల్లోనే సింహభాగం ఉంది. ఈ సంస్థలకు చెందిన విద్యాలయాల్లో విపరీతమైన ఫీజులతో, విద్యార్థులపై బోధన పేరుతో ఒత్తిడి చేస్తున్న పరిస్థితి నెలకొంది. సదరు విద్యాలయాల్లో ఎక్కువగా విద్యార్థుల ఆత్మహత్య ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ఇప్పుడు అలాంటి ఘటనల ను ఖండించేందుకు వెళ్లే విద్యార్థి, ఇతర ప్రజాసంఘాలను నిలువ రించేందుకు అవకాశం లేకుండా ఉత్తర్వులను తీసుకువచ్చారు. సదరు ఉత్తర్వుల అమలు వల్ల కార్పొరేట్ విద్యాసంస్థల దోపిడిని అరికట్టేందుకు లేకుండా పోతుంది. ప్రభుత్వ విద్యాలయాల్లో కూడా నెలకొన్న సమస్యలను అటు ప్రభుత్వం దృష్టికి, ఉన్నత అధికారుల దృష్టికి తీసుకు వెళ్లేందుకు లేకుండా పోయింది. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన బోధన అందుతుందో లేదో కూడా పరిశీలన చేసేందుకు లేకుండా ఈ ఉత్తరులను అడ్డంకిగా తీసుకువచ్చారు. ఇటువంటి ప్రజాస్వామిక ఉత్తర్వులను వెంటనే రద్దు చేయాలని విద్యార్థి సంఘాలు, ప్రజా సంఘాలు ప్రజాస్వామ్యవాదులు డిమాండ్ చేస్తున్నారు.

అవీ..ఇవీ..అన్నీ..

జిల్లా వ్యాప్తంగా మహిళలకు ఆర్‌టిసి బస్సుల్లో ఉచిత ప్రయాణాన్ని ప్రారంభించారు. ఆధార్ కార్డు చూపించిన మహిళలకు పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవం కార్యక్రమం నిర్వహించారు.





క్వారీ కార్మికుల భద్రతకు చర్యలు చేపట్టాలి

సిఐటియు నాయకులు ఎం.రవిచంద్ర

ప్రజాశక్తి- పత్తికొండ




క్వారీలో పనిచేసే కార్మికుల సంక్షేమం, భద్రత కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విస్మరించాయని, కనీసం వారి భద్రత కోసం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని శనివారం పత్తికొండ కుమ్మరి వీధిలోనిఎర్రగుడి ఈశ్వర్ రెడ్డి భవనంలో నిర్వహించిన క్వారీ కార్మికుల సమావేశంలో సిఐటియు మండల కార్యదర్శి ఎం.రవిచంద్ర పేర్కొన్నారు. సిపిఎం మండల కార్యదర్శి చక్రాల వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ క్వారీ కార్మికుల కోసం భద్రతా నిబంధనలు పటిష్టంగా అమలు చేయాలని, గనుల చట్టం, 1952 , దానికింద రూపొందించబడిన నియమ నిబంధనలను పటిష్టంగా అమలు చేయాలన్నారు. డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ (డిజిఎంఎస్) దీనిని పర్యవేక్షించాలని డిమాండ్ చేశారు. క్వారీ కార్మికులకు సామాజిక భద్రత కోసం బీమా సౌకర్యం కల్పించాలని, వయోపరిమితి 45 సంవత్సరాలకే పింఛన్ అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియ నాయకులు డి.గోపాల్ ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి పెద్దకాసిం, ప్రజానాట్యమండలి మండల కార్యదర్శి రమేష్, వ్యవసాయకార్మిక సంఘం జిల్లా నాయకులు సిద్దయ్య గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

క్వారీ కార్మిక సంఘం నూతన కమిటీ ఎన్నిక

క్వారీ కార్మిక సంఘం నూతన అధ్యక్షులుగా రంగన్న, కార్యదర్శిగా వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శిగా రామారావు, ఉపాధ్యక్షులుగా గోపాల్, కోశాధికారిగా రంగనాథులను ఎన్నుకున్నారు.

శాంతియుతంగా గణేష్ ఉత్సవం

ప్రజాశక్తి- వెల్దుర్తి



మాట్లాడుతున్న సిఐ మధుసూదన్‌రావు

గణేష్ ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలని వెల్దుర్తి సిఐ మధుసూదన్ రావు, ఎస్‌ఐ అశోక్ అన్నారు. వెల్దుర్తి లోని స్థానిక సిఐ కార్యాలయంలో శనివారం గణేష్ ఉత్సవ కమిటీ, హిందూ ధర్మ సేవాసంస్థ సభ్యులతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ వినాయక మండపాలకు, పోలీసు వారితో తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలి. విద్యుత్తు కనెక్షన్లకు విద్యుత్ శాఖ వారితో అనుమతి తీసుకోవాలని వారు సూచించిన నిబంధనలను పాటించాలన్నారు. మండపాల దగ్గర రాత్రి సమయంలో మైక్‌సెట్ లతో, డీజే శబ్దాలతో ప్రజలకు అసౌకర్యం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ ఎస్‌ఐ విద్యాశ్రీ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సామాజిక రక్షణ చట్టం అవసరం

-28న కలెక్టరేట్ ఎదుట రజక వృత్తిదారుల ధర్నా
-ఆంధ్రప్రదేశ్ రజక వత్తిదారుల సంఘం డిమాండ్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్




మాట్లాడుతున్న రజకవృత్తిదారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గురుశేఖర్

రాష్ట్రవ్యాప్తంగా రజకులపై దాడులు ,దౌర్జన్యాలు, అక్రమ కేసులు విరివిగా జరుగుతున్నాయని, వాటి నివారణకు రజకులకు సామాజిక రక్షణ చట్టం ఏర్పాటు చేయాలని , కూటమి ప్రభుత్వం ఎన్నికల ప్రణాళికలో పేర్కొన్న హామీలు అమలు కోసం కర్నూలు కలెక్టరేట్ వద్ద ఈనెల 25న ధర్నాను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సి.గురుశేఖర్ విజ్ఞప్తి చేశారు. శనివారం ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం జిల్లా కమిటి సభ్యులు సి.ఎల్లయ్య అధ్యక్షతన వీరనారి ఐలమ్మకార్యాలయంలో ధర్నాకు సంబంధించిన కరపత్రాన్ని విడుదల చేశారు. అనంతరం సమావేశంలో సి. గురుశేఖర్, కర్నూలు న్యూ సిటీ కార్యదర్శి సి.శేషాద్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ప్రణాళికలో ప్రకటించిన హామీలు అమలుపరచకుండా టిడిపి కూటమి ప్రభుత్వం ఏర్పడి 14 నెలలు పూర్తయినా ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన హామీల అమలు చేయడం లేదన్నారు. మంత్రులతో కూడిన సబ్ కమిటీ ఏర్పాటు చేసి ప్రభుత్వం కాలయాపన చేస్తుందని తెలిపారు. దీనివలన వివిధ ప్రాంతాలలో, పట్టణాలలో రజకులు సామాజిక దాడులకు గురై తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన రజక అభివృద్ధి-సంక్షేమ కార్పొరేషన్‌కు విధి విధానాలు రూపొందించి, రాష్ట్ర బడ్జెట్‌లో బిసి సామాజిక తరగతుల అభివృద్ధికి కేటాయించిన నిధులను బీసీ కార్పొరేషన్ ద్వారా రజకుల అభివృద్ధికి వినియోగించే విధంగా తగు చర్యలు చేపడతామన్నారని, ఆదరణ పథకం ద్వారా రజకులకు వృత్తి పరికరాలు మంజూరు చేస్తామన్నారని చెప్పారు. 50 యేళ్లు నిండిన ప్రతి రజక వృత్తిదారునికి వృద్ధాప్య పెన్షన్ మంజూరు చేస్తామని ,పట్టణ, నగర ప్రాంతాలలో లాండ్రీ వృత్తి చేసుకున్న వారికి నెలకు 250 యూనిట్లు ఉచిత కరెంటు మంజూరు చేస్తామని ప్రణాళికలో పేర్కొన్న హామీలు అమలు చేయడం లేదన్నారు. ఈ నిర్లక్ష్య వైఖరిని ప్రభుత్వ దృష్టికి, జిల్లా కలెక్టర్ ద్వారా తీసుకు రావడానికి ఈనెల 25న జరుగు ధర్నా దోహదపడుతుందన్నారు. ఓల్డ్ సిటీ కార్యదర్శి సి.జయమ్మ మాట్లాడుతూ వివిధ నివాస ప్రాంతాలలో రజక వృత్తిదారులు, కార్మికులు రజక యువత కరపత్రాలు పంపిణీ చేసి విరివిగా ప్రచారం నిర్వహించాలన్నారు. సమావేశంలో నగర అధ్యక్షులు సి.రాముడు, జిల్లా కమిటీ సభ్యులు రమణ,రేణుక, అంజి, శేఖర్ బాబు, వెంకటేశ్వర్లు, హరి, సుబ్బు, శేఖర్, రజక వృత్తిదారుల సంఘం నగర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అకాల వర్షాలకు రైతులు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-మద్దికేర



వర్షాకాలంలో రైతులు పంటలను కాపాడుకునేందుకు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయ అధికారి రవికుమార్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ కంది, పత్తి, జొన్న, సజ్జ, పంటలు తీవ్రంగా దెబ్బతినే అవకాశాలు ఉన్నాయని, వెంటనే సస్యరక్షణ చర్యలు చేపట్టాలని రైతులకు సూచించారు. అధిక వర్షపాతం కారణంగా రైతులు తమ పొలాలకు, 20 కిలోల యూరియాను 15 కిలోల పొటాష్ ను చల్లుకోవాలన్నారు. 13 - 0 - 45 ఎరువును ఎకరాకు ఒక కిలో పిచికారి చేయాలన్నారు. రైతు సేవా సిబ్బందితో కలిసి, వర్షపు నీరు నిలిచిన పొలాల్లో, ఎలా చర్యలు తీసుకోవాలో సలహాలు తీసుకోవాలన్నారు. మామిడి జామ శీన తదితర పండ్ల తోటల రైతులు సస్య రక్షణ చర్యలు చేపట్టాలన్నారు. సస్య రక్షణ చర్యలతో పంటలను కాపాడుకొని, అధిక దిగుబడులు సాధించి, లాభసాటి వ్యవసాయం చేయాలన్నారు.

స్పందించని జాతీయ రహదారుల శాఖ అధికారులు

ప్రజలపై పగ పట్టినట్లుగా వ్యవహరిస్తున్న కేంద్ర ప్రభుత్వం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు జిల్లా కేంద్రం మీదుగా వెళ్లే జాతీయ రహదారికి ఇరువైపులా సర్వీసు రోడ్లు గుంతలు పడి ప్రజలకు నరకం చూపిస్తున్నా.. జాతీయ రహదారుల శాఖ ఉన్నతాధికారులు స్పందించడంలేదని హైవే రోడ్డు సమీప కాలనీల అసోసియేషన్ ప్రతినిధి కె. వెంకటరామిరెడ్డి, ఆవాజ్ నాయకులు ఎల్.నయూం, పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు ఇరిగినేని పుల్లారెడ్డి, కె.మధుసూదన్ ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం ఉదయం కృష్ణా నగర్ నుండి రిజిస్ట్రేషన్ ఆఫీస్ మీదుగా రెండు కిలోమీటర్ల మేర స్థానికులతో కలిసి పట్టణ పౌర సంక్షేమ సంఘం ప్రతినిధి బృందం జాతీయ రహదారి కిరువైపులా ఉన్న సర్వీసు రోడ్లపై పర్యటించింది. గుంతలు పడ్డ రోడ్లు ప్రజలు పడుతున్న ఇబ్బందులను చూసి చలించి పోయిన బృందంసభ్యులు జాతీయ రహదారిపై ఎస్.రమణగౌడ్ ఆధ్వర్యంలో కొద్దిసేపు రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దాదాపు పదేళ్లుగా గుంతలు పడి ఇరుకైన సర్వీసు రోడ్లు పై ప్రమాదాలు జరిగి ప్రజలు ఆసుపత్రుల పాలవుతున్నారు. కేంద్ర ప్రభుత్వం కర్నూలు ప్రజలపై పగబట్టినట్లుగా వ్యవహరిస్తుందని విమర్శించారు. గ్రామీణ ప్రాంతాల్లో జాతీయ రహదారి కిరువైపులా కాలువలు నిర్మించారని అన్నారు. జిల్లా కేంద్రంలో హైవే రోడ్లకిరువైపులా కాలువలు ఎందుకు నిర్మించలేదని ప్రశ్నించారు. వర్షం వస్తే గుంతలతో పాటు సర్వీసు రోడ్డు కూడా ఎక్కడుందో కనిపించదని అన్నారు. వెంటనే నిబంధనల ప్రకారం సర్వీసు రోడ్లను నిర్మించి ఇరువైపులా మురుగు కాలువలు నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎండి యూనుస్, సిత్తారి వెంకటవర్మ, బి.రాజు, పాండురంగారెడ్డి, ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ యూనియన్ నాయకులురాజు, శంకర్, నూరు బాష, ఖాదర్ వలీ, జయరాజు తదితరులు పాల్గొన్నారు.



హైవే పక్కన గుంతలమయమైన రోడ్డును పరిశీలిస్తున్న పిపిఎస్‌ఎస్ నాయకులు



గౌతు లచ్చన్న చిత్రపటానికి నివాళ్లు అర్పిస్తున్న కలెక్టర్, ఇతర అధికారులు

గౌతులచ్చన్నకు ఘనంగా నివాళులు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

స్వాతంత్ర్య సమర యోధుడు సర్దార్ గౌతులచ్చన్న జయంతిని పురస్కరించుకుని కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో శనివారం ఆయన చిత్రపటానికి కలెక్టర్ పి.రంజిత్ బాషా పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ స్వాతంత్రోద్యమంలో గౌతు లచ్చన్న చూపిన పోరాటపటిమ యువతకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి ప్రసూన, గౌడ సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ , టిడిపి బిసి సెల్ స్టేట్ సెక్రటరీ కాసాని మహేష్ గౌడ్, రవిశంకర్ గౌడ్, రాజశేఖర్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, సంతోష్‌గౌడ్, శేఖర్‌గౌడ్, మల్లికార్జున గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ యుగంగా మారుతుంది

సియాంట్ వ్యవస్థాపక చైర్మన్ మోహన్ రెడ్డి

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్



ప్రస్తుతం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఇవ్వంగా మారుతుందని సియంట్ వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ బివిఆర్. మోహన్ రెడ్డి అన్నారు. శనివారం కర్నూలు నగర శివారులోని జగన్నాథ గట్టు సమీపంలో ఉన్న ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ డిజైన్ అండ్ మ్యానుఫ్యాక్చరింగ్ విద్యాసంస్థను ఆయన సందర్శించారు. అక్కడ విద్యార్థులతో కొద్దిసేపు సంభాషణ చేశారు. విద్యార్థులు ఆయనను పలు ప్రశ్నలు సందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ డిజైన్ అండ్ మ్యానుఫ్యాక్చరింగులో మిల్కీతం కావాలని కోరారు. అనంతరం ఆయనను అధ్యాపక బృందం ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్లు కృష్ణయ్య సురేష్ బాబు లు పాల్గొన్నారు.

75 యేళ్ల తెలుగు కథపై నేడు సదస్సు

ప్రజాశక్తి - కర్నూలు కల్చరల్

సాహిత్య అకాడమీ సాహితీ స్రవంతి సంయుక్తంగా నిర్వహిస్తున్న 75 సంవత్సరాలు (1947-2022) తెలుగు చిన్న కథలు అన్న అంశంపై నేడు అనగా ఆదివారం ఉదయం 10.00లకు లలితకళా సమితిలో నిర్వహిస్తున్నామని సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆవుల బసప్ప, చక్రపాణి యాదవ్‌లు తెలిపారు. సదస్సును సాహితీ స్రవంతి రాష్ట్రాధ్యక్షులు కెంగార మోహన్ ప్రారంభిస్తారని అన్నారు. వక్తలుగా కె. నాగేశ్వరాచారి ప్రగతిశీల, విప్లవ కథలు, ఎన్ఎండి. ఇనాయతుల్లా మైనార్టీ, స్త్రీవాద కథలు, జి. వెంకటకృష్ణ దళిత, బహుజన, గిరిజన కథలు, మారుతీ పౌరోహితం ప్రాంతీయ కథలపై ప్రసంగిస్తారన్నారు. సదస్సుకు కవులు కళాకారులు, రచయితలు, పరిశోధక విద్యార్థులు హాజరై జయప్రదం చేయాలన్నారు.



గోల్డ్ మెడల్ అందుకున్న తనుశ్రీ

ఇష్టంతో చదవాలి

- సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ప్రజాశక్తి - ఆదోని

కష్టంతో కాకుండా ఇష్టంతో చదివి జీవితంలో స్థిరపడేలా ప్రణాళిక రూపొందించుకోవాలని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ తెలిపారు. ఆదోని ఆర్ట్స్ సైన్స్ కళాశాలలో బిఏ పొలిటికల్ సైన్స్‌లో అత్యుత్తమ మార్కులు సాధించిన తనుశ్రీకి శనివారం కళాశాల పూర్వపు విద్యార్థి బైరామ్ పెద్దయ్య సౌజన్యంతో గోల్డ్ మెడల్ అందజేశారు. ఆయన మాట్లాడుతూ... పేద విద్యార్థులకు ప్రభుత్వం అండగా ఉంటూ సదుపాయాలు కల్పిస్తోందని తెలిపారు. పూర్వపు విద్యార్థి బైరామ్ పెద్దయ్య మాట్లాడుతూ... తాను చదివే రోజుల్లో తనకు బంగారు పతకం వచ్చిందని, ఆ స్ఫూర్తితో కళాశాలలో వరుసగా రెండో సంవత్సరం ఉత్తమ విద్యార్థికి బహుకరించడం ద్వారా కళాశాల రుణం కొంత తీర్చుకుంటున్నట్లు తెలిపారు. కళాశాల కరస్పాండెంట్ వైజనాథ్‌రెడ్డి పూర్వ విద్యార్థి బైరామ్ పెద్దయ్యకు కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా విజయభాస్కర్‌రెడ్డి జయంతి



నివాళులర్పిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

మాజీ ముఖ్యమంత్రి కీర్తిశేషులు కోట్ల విజయభాస్కర్ రెడ్డి 105వ జయంతి వేడుకలను పట్టణంలోని భీమాస్ సర్కిల్‌లో కోట్ల విజయభాస్కర్ రెడ్డి విగ్రహం ముందు శనివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రాయచోటి సుబ్బయ్య, దేవిశెట్టి ప్రకాష్, శ్రీనివాసరెడ్డి, సోమశేఖర్ రెడ్డి, విజయ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ... మచ్చలేని నాయకుడు కోట్ల అని కొనియాడారు. గుల్ఫరోష్ షఫీ, ధర్, నసిరుద్దీన్ పటేల్, లక్ష్మీనారాయణ శెట్టి, సుధాకర్ బాబు, శ్రీనివాసులు, విరుపాక్షి రెడ్డి, మాధవరావు, సుగురప్ప పాల్గొన్నారు.

రైతులకు యూరియా పంపిణీ



యూరియాను పంపిణీ చేస్తున్న ఖాసీంవలీ

ప్రజాశక్తి - నందవరం

టిడిపి మండల అధ్యక్షులు ఖాసీంవలీ రైతులకు యూరియా పంపిణీ చేశారు. శనివారం మండలంలోని పెద్దకొత్తిలి, చిన్నకొత్తలి, గంగవరం, జొహరాపురం, సజీవపురం గ్రామాల రైతులకు యురియా పంపిణీ చేశారు. ఆదిశేషులు, కైరవాడి వీరేష్, డబ్బా ఈరన్న, సోమన్న పాల్గొన్నారు.

సారా విక్రయం నేరం : సిఐ

ప్రజాశక్తి - ఆదోని



స్థావరాలను ధ్వంసం చేస్తున్న పోలీసులు

నాటుసారా తయారు చేసినా, విక్రయించినా చట్టరీత్యా నేరమని, అలాంటి వారిపై కేసు నమోదు చేస్తామని ప్రొహిషన్, ఎక్సైజ్ సిఐ సైదుల్ హెచ్చరించారు. నవోదయం 2.0లో భాగంగా శనివారం ఆదోని ఎక్సైజ్ పోలీసు, ఆదోని సివిల్ పోలీసులతో కలిసి ఆదోనిలోని అఫిసారాల్ల కొండల్లో 260 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి, 12 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆదోనిలోని వాల్మీకి నగర్‌కు చెందిన బోయ వెంకటేష్‌పై కేసు నమోదు చేసినట్లు, బోయ గుంటెమ్మను అరెస్టు చేసి 5 లీటర్ల నాటుసారాను సీజ్ చేసి రిమాండ్‌కు తరలించామని చెప్పారు.

గ్రామాల్లో వీడని కులరక్కసి

- క్షవరం చేయరు.. దేవాలయాల్లోకి రానివ్వరు..
- హోటళ్లలోనూ తేడాలు
- కానరాని సివిల్ రైట్స్ డే

ప్రజాశక్తి - హొళగుంద

స్వాతంత్ర్యం వచ్చి 79 ఏళ్లయినా ఇప్పటికీ జిల్లాలోని హొళగుంద మండలంలోని గ్రామాల్లో కులరక్కసి వీడడం లేదు. గ్రామాల్లోని ఎస్సీ కులాల వారికి క్షవరం చేయరు.. దేవాలయాల్లోకి రానివ్వరు. హోటళ్లలోనూ తేడాలు చూపిస్తారు. తమను పశువుల కన్నా హీనంగా చూస్తున్నారని ఎస్సీ కులాల వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు..

గ్రామాల్లో నేటికీ కుల వివక్ష కొనసాగుతోంది. ఎస్సీలకు దేవాలయ ప్రవేశాలు కల్పించడం లేదు. హోటళ్లలోనూ తేడాలు, క్షురకులు క్షవరం చేయరు. రజకులు బట్టలు ఉతకరు. చదువుకున్న దళిత యువకులు ఆత్మస్థైర్యం కోల్పోతూ లోలోపల కుమిలిపోతున్నారు. చెప్పులు కుట్టే సేవలు, చనిపోయిన వారికి గుంతలు తీసే సేవలు, డప్పు కొట్టడం, పెళ్లి పేరంటాల్లో లైట్లు మోయడం వంటి సేవలకు అగ్రవర్ణాలు పెత్తందారులు ఎస్సీలను వినియోగించుకుంటున్నారు.' ఎస్సీలై పుట్టినందుకు ఇంతటి శిక్ష ఎందుకు మాకు.. అగ్రవర్ణాలకు, మాకు తేడాలు ఉన్నాయా.. మా సేవలైతే వారికి అవసరం. వారి సేవలు మాకు అవసరం లేదా..? ఇంతటి దౌర్భాగ్య స్థితిలో జీవనం కొనసాగించడం ఎలా' అంటూ ఎస్సీలు వాపోతున్నారు. 'మా తాత, ముత్తాతలు, తండ్రులు వివక్షతను అనుభవిస్తూ వచ్చారు. మా తరాన్నీ కులరక్కసి మమ్మల్ని వీడడం లేదు' అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 'మేము స్వేచ్ఛగా తిరిగినా కష్టం. రచ్చబండపై కూర్చున్నా కులం పేరుతో దూషణలు తప్పడం లేదు.. ప్రభుత్వాలు మారుతున్నా మా జీవితాలు మారడం లేదు. మమ్మల్ని పశువుల కన్నా హీనంగా చూస్తున్నారని' పేర్కొంటున్నారు.

కానరాని సివిల్ రైట్స్ డే

ప్రతినెలా 30న మండల స్థాయి అధికారులు తహశీల్దార్, ఎస్ఐ, ఎంపిడిఒ పౌర హక్కులకు భంగం కలుగకుండా, పౌర హక్కుల గురించి ప్రజలకు అవగాహన కల్పించడం, వాటి ప్రాముఖ్యతను వివరించడంకు సివిల్ రైట్స్ డే నిర్వహించాల్సి ఉంది. జాతి, మత, లింగ భేదాలు లేకుండా చూడాలి. ప్రతి ఒక్కరికీ సమాన హక్కుల అవకాశాలు లభించేలా చూడాలి. వివక్ష లేని సమాజాన్ని నిర్మించడంలో వీరు కీలక పాత్ర పోషించాలి. కర్ణాటక సరిహద్దు ప్రాంతాల్లో అత్యధికంగా ఎస్సీలు వివక్షకు గురవుతున్నారని సంబంధిత శాఖ అధికారులకు తెలిసినా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. విమర్శలు లేకపోలేదు. సమాజం మార్పు కోసం తమవంతుగా ఒక్కడుగు ముందుకు వచ్చి ప్రతినెలా 30న పౌర హక్కుల దినోత్సవం సందర్భంగా ఏదో ఒక గ్రామంలో అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి అవగాహన కల్పించాలి. మార్పు రాకపోతే కుల రక్కసి, వివక్షపై కఠిన చర్యలు చేపడితే ఎంతో కొంత మార్పు వస్తుంది.

గ్రామాల్లో వివక్ష ఇలా..!

మండలంలోని వందవాగిలి, సులువాయి, నెరనికి, కోగిలతోట, హెబ్బటం, తదితర గ్రామాల్లో ఎస్సీలు క్షురకుల షాపులకు వెళితే 'మీరు అంటరాని వారు. మీకు మేం కటింగ్ చేయబోమని చెబుతున్నారు. 'మీ తాత, ముత్తాతల నుంచి ఇదే సంప్రదాయం కొనసాగుతోంది. మీరేం ఇప్పుడు కొత్తగా మాట్లాడుతున్నారు. తమాషాలు చేస్తారా.. మీ అంతు చూస్తాం'అంటూ క్షురకులు వివక్ష చూపుతున్నారు. ఇక మండలంలోని 17 పంచాయతీల్లో ఆరు మజరా గ్రామాల్లో మొత్తం 23 పల్లెల్లో నేటికీ దేవాలయ ప్రవేశం లేదు. రజకులు బట్టలు ఉతకరు. రచ్చబండ మీద అందరితో పాటు కూర్చోనీయరు. పెళ్లిళ్ల ఇతర సమయాల్లో పందిళ్లలో ఊరేగింపు ఊసే లేదు. సంబంధిత అధికారులు ఆయా గ్రామాల్లో ఎస్సీలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వివక్ష రూపుమాపడానికి కృషి చేయాలని పలువురు కోరుతున్నారు.

ఇష్టమొచ్చిన దగ్గర చెప్పుకోండి అంటున్నారు

- బాధితుడు కృష్ణ, వందవాగిలి



ఐదు రోజుల నుంచి మా గ్రామంలో మంగలి సేవల కోసం వెళ్లాను. 'మీ తాత, ముత్తాతల నుంచి లేవు. ఇప్పుడేం కొత్తగా అడుగుతున్నారు. మీకు షేవింగ్, కటింగ్ చేసేదే లేదు. ఇష్టమొచ్చిన కాడ చెప్పుకోండి' అంటూ మంగలి గాదిలింగ అంటున్నారు.

డప్పు కొట్టనందుకు దాడి చేశారు

- బాధితుడు నాగేంద్ర, ముద్దటమాగి



గణేచాని పీర్ల పండగ ఊరేగింపులో డప్పు కొట్టాలని గొల్ల తిమ్మారెడ్డి, ఆయన అనుచరులు నన్నూ, మరో 13 మందిపైనా దాడి చేశారు. ఇద్దరు మహిళలు కూడా ఉన్నారు. మహిళలని చూడకుండా కొట్టారు. ఈ ఘటనపై అప్పట్లో పోలీసులకు ఫిర్యాదు చేశాం. పోలీసులు విచారించి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. మమ్మల్ని కొట్టి, మాపైనే కౌంటర్ కేసు నమోదు చేయించారు. ఇప్పటికీ మేము వాయిదాలకు తిరుగుతున్నాం.

మా దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటాం

- తహశీల్దార్ నిజాముద్దీన్ (ఎఫ్ఎసి)



ఎవరైనా సరే అంటరానితనం, వివక్ష చూపిస్తున్నట్లు మా దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటాం. గ్రామాల్లో మేము కూడా పర్యటిస్తాం. గతంలో అవగాహన సదస్సులు కూడా నిర్వహించాం. భవిష్యత్తులో కూడా అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తాం.

రాఘవేంద్రుని సన్నిధిలో భక్తుల కోలాహలం

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో కొలువైన రాఘవేంద్రస్వామిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులతో శ్రీమఠంలో కోలాహలం నెలకొంది. శనివారం రాఘవేంద్రస్వామి దర్శనార్థమై దేశంలో ఉన్న వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. గ్రామ దేవత మంచాలమ్మను, రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని దర్శించుకొనేందుకు బారులు తీరారు. స్వామి వారికి ప్రత్యేక సేవలు చేయించిన భక్తుల సమక్షంలో రాఘవేంద్రుని బృందావన ప్రతిమకు విశేష పూజలు నిర్వహించి మంగళ హారతులు ఇచ్చారు. అనంతరం బృందావన ప్రతిమను స్వర్ణ పల్లకిలో ఉంచి మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ శ్రీమఠం ప్రాకారంలో ఘనంగా పల్లకోత్సవం నిర్వహించారు.



ఆలయ ప్రాంగణంలో ఉన్న భక్తులు



ఆదోని నుంచి 65 బస్సులు

- డిఎం రఫీక్ మహ్మద్

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని ఆర్‌టిసి డిపో నుంచి 65 బస్సు సర్వీసుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయం కల్పిస్తున్నామని ఆర్‌టిసి డిఎం రఫీక్ మహ్మద్ శనివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ... స్టార్ లైన్, నాన్ స్టాప్, ఇంటర్ స్టేట్ బస్సు సర్వీసులు మినహా మిగతా బస్సుల్లో రాష్ట్రమంతా ఉచితంగా ప్రయాణం చేయవచ్చన్నారు. ఆధార్, ఓటర్, రేషన్ కార్డు గుర్తింపు కోసం చూపించాల్సి ఉంటుందని తెలిపారు. కర్నూలు, అనంతపురం దూర ప్రాంతాలకు వెళ్లే మహిళలు ఉచితం వల్ల ఖర్చు తగ్గుతుందని చెప్పారు. నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో బస్సులు నడపాలని మహిళలు కోరారు.

'ఉచిత బస్సు' ప్రారంభం

ప్రజాశక్తి - దేవనకొండ

దేవనకొండలోని బస్టాండ్ ఆవరణలో స్త్రీ శక్తి ఉచిత బస్సు పథకాన్ని మాజీ ఎంపిటిసి ఆకుల వీరేష్ శనివారం ప్రారంభించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. సర్పంచి భర్త మాల బండ్లయ్య, తెలుగు యువత నాయకులు పి.రాజాసాబ్, పట్టణ ఉపాధ్యక్షులు తిమ్మయ్య, జనసేన నాయకులు ఉచ్చీరప్ప, రామాంజనేయులు పాల్గొన్నారు.



దేవనకొండలో ఉచిత బస్సు పథకాన్ని ప్రారంభిస్తున్న మాజీ ఎంపిటిసి ఆకుల వీరేష్

ఈరన్న స్వామికి వెండి బిందెలు విరాళం

ప్రజాశక్తి - కౌతాళం

శ్రీలక్ష్మినరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయానికి కిలో 200 గ్రాములతో చేయించిన వెండి బిందెలను ట్రస్ట్ బోర్డు మాజీ ఛైర్మన్ చెన్న బసప్ప అందజేశారు. శనివారం చెన్నబసప్ప కుటుంబ సమేతంగా పుణ్యక్షేత్రానికి చేరుకొని దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అధికారులు స్వాగతం పలికి, శాలువా, పూలమాలలతో సన్మానించారు. దేవాలయ డిప్యూటీ కమిషనర్ వాణి, పర్యవేక్షకులు వెంకటేష్, ఉప ప్రధాన అర్చకులు మహదేవ స్వామి, టిడిపి టౌన్ ప్రెసిడెంట్ కాశీ విశ్వనాథ్, నాయకులు కొట్రేష్ గౌడ్ పాల్గొన్నారు.



విరాళం అందజేస్తున్న దాతలు

పంటల రక్షణకు జాగ్రత్తలు అవసరం

- ఎఒ సుధాకర్

ప్రజాశక్తి-ఆదోనిరూరల్



గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో రైతులు వాతావరణ ఆధారిత వ్యవసాయ సూచనలు పాటించాలని ఎఒ బివిజి.సుధాకర్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడారు. పత్తి వేసిన రైతులు ఈ అధిక వర్షాల వల్ల పొలాల్లో నిలిచిన నీటిని వీలైనంత త్వరగా కాలువల ద్వారా బయటకు పంపాలని సూచించారు. అధిక వర్షాల వల్ల నేలలోని పోషకాలు లీచింగ్ అయి లోపాలు ఏర్పడతాయని తెలిపారు. రైతులు పొటాషియం నైట్రేట్ 20 గ్రాములు/లీటరు లేదా 19:19:19 (10 గ్రాములు/లీటరు) లేదా మల్టీకే 13-0-45 (20 గ్రాములు/లీటరు) ద్రావణాన్ని పిచికారి చేయాలని సూచించారు. యూరియా అధికంగా వాడితే తెల్లదోమ, రసం పీల్చే పురుగుల ఉధృతి పెరుగుతుందని, యూరియా వినియోగంలో జాగ్రత్త వహించాలని తెలిపారు. పంట త్వరగా కోలుకోవడానికి నానో డిఎపి 500 మిల్లీలీటర్లు ఎకరాకు పిచికారి చేయాలని, లీచింగ్ వల్ల నైట్రోజన్ లోపాన్ని సరిచేయడానికి నానో యూరియా 500 మిల్లీలీటర్లు ఎకరాకు పిచికారి చేయాలని సూచించారు.

రసం పీల్చే పురుగుల నియంత్రణ

పచ్చదోమ, పేనుబంక, తామర పురుగుల నియంత్రణకు ఫిప్రోనిల్ 2 మిల్లీలీటర్లు/లీటరు, డెలిగేట్ 1 మిల్లీలీటర్లు/లీటరు, డైనోటెఫ్యురాన్ 0.3 గ్రాములు/లీటర్ నీటికి కలుపుకొని పిచికారి చేయాలన్నారు. ప్రతి ఎకరాకు 10 నీలం రంగు జిగురు అట్టలు ఏర్పాటు చేయాలని సూచించారు

తెల్లదోమ నియంత్రణ

ప్రతి ఎకరాకు 10-15 పసుపు రంగు జిగురు అట్టలు పెట్టాలని, ఉధృతి ఎక్కువైతే డైఫెన్‌థియురాన్ 1.25 గ్రాములు/లీటరు, ప్రోఫెనోఫాస్ 2 మిల్లీలీటర్లు/లీటరు నీటికి కలుపుకొని పిచికారి చేయాలన్నారు. అధిక వర్షాల వల్ల కాయ కుళ్ళు, ఆకుమచ్చలు కనబడితే- కోనికా, కోసైడ్ ఎ 300 గ్రాములు/200 లీటర్ల నీటిలో కలిపి ఎకరాకు పిచికారి చేయాలని సూచించారు.

నీటి వృథాను అరికట్టాలి : సిపిఎం

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

మండలంలోని గణేకల్లు గ్రామంలో తాగునీటిని వృథాను అరికట్టాలని సిపిఎం మండల కార్యదర్శి వర్గసభ్యులు బి.వీరారెడ్డి కోరారు. శనివారం ఆయన మాట్లాడారు. గ్రామంలో పంచాయతీ మోటార్ నుంచి వచ్చే నీటిని నాలుగు మినీ వాటర్ ట్యాంకుల ద్వారా ప్రజలకు అందించేవారని తెలిపారు. గతంలో సిసి రోడ్లు, డ్రెయినేజీలు వేసే సందర్భంలో పైపులు పగిలాయని, మోటార్ మరమ్మతులకు రావడంతో దాదాపు నాలుగు నెలల పాటు నీళ్లు రాక ప్రజలు ఇబ్బందులు పడే పరిస్థితి వచ్చిందని చెప్పారు. సిపిఎంగా పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లడంతో పంచాయతీ మోటార్ మరమ్మతులు చేయించారని తెలిపారు. వచ్చే నీటిని రెండు మినీ వాటర్ ట్యాంకులకే పరిమితం చేశారని, మిగిలిన రెండింటికీ నీళ్లు రావని చెప్పారు. అధికారులు స్పందించి నీటి వృథాను అరికట్టి మిగిలిన రెండు మినీ వాటర్ ట్యాంకులకు నీరందించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. శాఖ కార్యదర్శి విరుపాక్షి, సభ్యులు చిన్న వీరేష్, చిరంజీవి పాల్గొన్నారు.



మినీ వాటర్ ట్యాంకు నుంచి వృథాగా పోతున్న తాగునీరు

రోడ్ల వెడల్పు కలేనా..?

- ఆదోనిలో పెరుగుతున్న వాహనాల రద్దీ - ఫుట్‌పాత్ కరువు



ఇరుకుగా ఉన్న ప్రధాన రోడ్డు

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలో వాహనాల రద్దీ రోజురోజుకు పెరుగుతూనే ఉంది. రాష్ట్రంలోనే రెండో మున్సిపాలిటీగా ఆదోనికి పేరు ఉంది. అలాంటి పట్టణం ప్రస్తుతం పాలకుల ముందుచూపు ప్రణాళిక లేక అభివృద్ధికి నోచుకోక వెనుకబడిపోతోంది. మాస్టర్ ప్లాన్ అమలు చేస్తామని, ఆక్రమణ కట్టడాలు తొలగిస్తామని అధికారంలోకి రాకముందు చెప్పే మాటలు పరిపాటుగా మారాయి.

పట్టణంలో సుమారు 2 లక్షల జనాభా ఉంది. ఇరుకు రోడ్లు ఉండడంతో ట్రాఫిక్ పద్మవ్యూహాన్ని తలపించేలా ఉంటుంది. కొత్తగా ఏర్పడిన మున్సిపాలిటీలో రోడ్ల వెడల్పు, మధ్యలో డివైడర్లు ఏర్పాటు చేశారు. ఆదోనిలో మాత్రం రోడ్ల వెడల్పు చేపడతామని ఎన్నికలకు ముందు చెబుతూనే ఉన్నప్పటికీ అధికారంలోకి రాగానే మాట మార్చడం ఎమ్మెల్యేలకు పరిపాటిగా మారింది. మున్సిపల్ మెయిన్ రోడ్డు, పండిట్ నెహ్రూ రోడ్డు, తానాజీ రోడ్డు ప్రాంతాలు ఎప్పుడూ వాహనాలతో రద్దీగా ఉంటున్నాయి. దుకాణదారులు, బైక్‌లు రోడ్డుపై నిలవడం వల్ల వచ్చిపోయే వారికి ఇబ్బందికరంగా మారింది.

ఫుట్‌పాత్ లేని పరిస్థితి

పట్టణంలో సుమారు 2 లక్షల జనాభా ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. 34 వేల గృహాలు ఉన్నాయని, పట్టణం విస్తీర్ణం 37 చదరపు కిలోమీటర్ల ఉన్నట్లు అధికారులు వెల్లడిస్తున్నారు. ప్రధాన రోడ్లపై కూడా ఫుట్‌పాత్ లేకపోవడంతో రోడ్డుపైనే కాలినడకన వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. రాను, పోను ఆటోల్లో, బైకులతో కాలినడకన వెళ్లేవారు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు ఎప్పుడో ఒకసారి వారికి తోచిన విధంగా రోడ్డు పక్కన చిన్న, చిన్న అంగుళ్లను తొలగించడం, మళ్లీ వదలడం జరుగుతూనే ఉంది. ప్రధానంగా అడ్డంగా ఉన్న కట్టడాలు జోలికి మాత్రం వెళ్లడం లేదు. అధికారులు రోడ్డు వెడల్పు చేయించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్ల వెడల్పునకు ప్రతిపాదన సిద్ధం

- బాల మద్దయ్య, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్, ఆదోని



పట్టణంలోని మున్సిపల్ మెయిన్ రోడ్డు, పిఎన్ రోడ్ వెడల్పునకు ప్రతిపాదన సిద్ధం చేశాం. గణేష్ సర్కిల్ వరకు 2.5 కిలోమీటర్ల వెడల్పునకు గతంలో రూ.50 కోట్లు మంజూరయింది. నిధులు సరిపోకపోవడంతో అప్పట్లో పనులు జరగలేదు. ప్రస్తుతం రూ.140 కోట్లు అవసరమని ప్రభుత్వానికి ప్రతిపాదన పంపాం. ప్రభుత్వం నుంచి నిధులు రాగానే పనులు మొదలు పెడతాం.

ట్రాఫిక్‌తో ప్రజలకు ఇబ్బందులు

- లక్ష్మణ్, సిపిఎం పట్టణ కార్యదర్శి



పట్టణంలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల నుంచి పాతబస్టాండ్ వరకు రోడ్డు ఎప్పుడూ వాహనాలతో రద్దీగా ఉంటుంది. ప్రత్యమ్నాయా రోడ్డు లేకపోవడంతో సుదూర ప్రాంతాలకు వెళ్లేవారు కూడా పట్టణం మీదుగానే రాకపోకలు సాగించాల్సి ఉంది. హైవే పనులు సత్వరమే పూర్తి చేసి ఉపయోగంలోకి తీసుకురావాలి. అన్యాక్రాంతమైన రోడ్డు ప్రాంతాన్ని అధికారులు స్వాధీనం చేసుకొని వెడల్పు చేయాలి. ట్రాఫిక్ సమస్యను క్రమబద్ధీకరించ లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతూనే ఉంటారు.

రహదారి ప్రమాదాల నియంత్రణే లక్ష్యం

- కర్నూలు రేంజ్ డిఐజి డాక్టర్ కోయ ప్రవీణ్

- జిల్లా ఎస్‌పి విక్రాంత్ పాటిల్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

ప్రతి శనివారం రోడ్డు భద్రత పై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పోలీసు అధికారులకు కర్నూలు రేంజ్ డిఐజి డాక్టర్ కోయ ప్రవీణ్ , జిల్లా ఎస్‌పి విక్రాంత్ పాటిల్ లు ఆదేశాలు జారీ చేశారు. వాహనదారులు రహదారి భద్రత నియమాలు పాటిస్తే రోడ్డు ప్రమాదాల నివారణ సాధ్యమవుతుందని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆయా పోలీసుస్టేషన్ పరిధులలో జిల్లా పోలీసు అధికారులు ప్రజలకు రోడ్డు భద్రత , ట్రాఫిక్ నిబంధనల పై సమావేశాలు నిర్వహించి, అవగాహన కల్పించారు. మైనర్లు వాహనాలు నడపకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. బైక్‌లు నడిపే వారు ఖచ్చితంగా హెల్మెట్లు ధరించే విధంగా , ఓవర్ స్పీడ్ , ఓవర్ లోడ్ తో వాహనాలు వెళ్ళకుండా, డ్రంకెన్ డ్రైవ్ చేయరాదని తదితర రోడ్డు భద్రత ప్రాముఖ్యతల పై ప్రజలకు అవగాహన కల్పించారు.



తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు



గోడపత్రికను ఆవిష్కరిస్తున్న నాయకులు

'రాష్ట్ర మహాసభలను జయప్రదం చేద్దాం'

ప్రజాశక్తి - ఆదోని

ఈనెల 20 నుంచి 25 వరకు ఒంగోలులో జరిగే సిపిఐ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామాంజనేయులు కోరారు. శనివారం స్థానిక ఎఐవైఎఫ్ కార్యాలయంలో పట్టణ సమితి ఆధ్వర్యంలో మహాసభ గోడపత్రికలను ఆవిష్కరించారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సుదర్శన్, పట్టణ కార్యదర్శి వీరేష్, జిల్లా సమితి సభ్యులు అజయ్ బాబు, రైతుసంఘం నాయకులు బసాపురం గోపాల్, శాఖ కార్యదర్శి విజయ్ పాల్గొన్నారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

- పురవీధుల్లో వేణుగోపాల స్వామి రథోత్సవం

ప్రజాశక్తి - ఆదోని



ఆదోనిలో కృష్ణుని వేషధారణలో ఉన్న చిన్నారులు



గోనెగండ్లలో ఊరేగింపు నిర్వహిస్తున్న మహిళలు

పట్టణంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. కార్వాన్ పేటలోని వేణుగోపాల స్వామి దేవాలయం నుంచి సాయంత్రం స్వాముల వారి రథోత్సవం పురవీధుల్లో వైభవంగా సాగింది. రథోత్సవం ముందు మహిళలు, చిన్నారులు కలశాలు చేత పట్టుకొని ఊరేగింపుగా వెళ్లారు. నృత్యం మాస్టర్ ఆధ్వర్యంలో చిన్నారుల కోలాటాలు, బీరయ్య డోలు ఆకట్టుకున్నాయి. రథోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. ఉదయం గోపూజ, పంచామృతాభిషేకం, తులసి, సహస్రాభిషేకం వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. సాయంత్రం 4 గంటల నుంచి పురవీధుల్లో వైభవంగా రథోత్సవం చేపట్టారు. పట్టణంలోని అమరావతి ఇంటర్నేషనల్ స్కూల్‌లో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణ, గోపిక వేషధారణలో చిన్నారులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి అలరించారు. కరస్పాండెంట్ గుడిసె రామకృష్ణ మాట్లాడుతూ... సంస్కృతి, సాంప్రదాయాలను ప్రతి ఒక్కరూ గౌరవించాలని తెలిపారు. ఉపాధ్యాయులు రాజేశ్వరి, ఉపాధ్యాయులు ఉన్నారు. **గోనెగండ్ల**లో కృష్ణాష్టమి వేడుకలను నిర్వహించారు. గంగపూజ, నవగ్రహ పూజ, గోపూజ, పంచామృత పూజలు నిర్వహించారు. సాయంత్రం ఉట్టికొట్టే కార్యక్రమం ఆహ్లాదకరంగా సాగింది. యశోద, చిన్ని కృష్ణుని వేషధారణలో చిన్నారులు పలు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. సాయంత్రం గ్రామంలోని గొల్ల వీధి నుంచి కృష్ణుని ఉత్సవ విగ్రహాన్ని బీరప్ప దేవాలయం వరకు మేళతాళాలతో వైభవంగా ఊరేగించారు. **ఆస్పరి**తో పాటు హాలిగేర, చిరుమాన్ దొడ్డి గ్రామాల్లో శ్రీకృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. ఉదయం శ్రీభీమ లింగేశ్వర స్వామి దేవాలయం నుంచి పెద్ద బావి దగ్గర గంగను తీసుకొని భీమ లింగేశ్వర స్వామి దేవాలయంలో శ్రీకృష్ణుని విగ్రహానికి జలాభిషేకం, గంగపూజ, పంచామృతాభిషేకం, మహా మంగళ హారతులు చేపట్టారు. సాయంత్రం దేవాలయం ముందు ఉట్టి ఉత్సవం ఏర్పాటు చేశారు. అనంతరం స్వామివారి చిత్రపటాన్ని ఎద్దుల బండిపై అధిష్టించి మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకెళ్లారు. బండి ముందు చిన్ని కృష్ణుని, గోపిక వేషధారణలో ఆకట్టుకున్నారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. రఘు, రామాంజిని, వెంకట రాముడు, అరవింద్, కృష్ణ, ప్రకాష్, దినేష్, గిరిధర్, పరమేష్, రాము, లక్ష్మీనారాయణ, రాజ్ గోపాల్, అంపయ్య పాల్గొన్నారు.



ఆస్పరిలో ఉట్టి కొడుతున్న యువకులు